ఎర్రజెండానే 'ప్రజల గొంతుక'

- పుస్తకావిష్కరణలో జూలూరు గౌరి శంకర్, పాశం యాదగిరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్రజెండానే ప్రజల గొంతుక అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరిశంకర్ చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని గుర్తు చేశారు. పేద ప్రజలపక్షాన 45 ఏళ్లుగా ఎర్రజెండా పట్టుకుని ముందుకు సాగుతున్నారని చెప్పారు. అనేక ప్రజాసమస్యలను అసెంబ్లీ వేదికగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఇప్పుడు నిశ్శబ్దం చాలా ప్రమాదకరస్థాయిలో ఉందని, ఈ నేపథ్యంలో ప్రశ్నించడం రావాలన్నారు. నిశబ్దం చాలా ప్రమాదకరమన్నారు. ప్రజల్లో నుంచి ఒక గాంధీ, ఒక భగత్‌సింగ్ రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్ 35వ బుక్‌ఫెయిర్‌లో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రచించిన 'ప్రజల గొంతుక' రాజకీయ సామాజిక వ్యాసాలు-అసెంబ్లీ ప్రసంగాలు అనే పుస్తకాన్ని నవతెలంగాణ జనరల్ మేనేజర్ వాసు, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు కోయ చంద్రమోహన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డితో కలిసి జూలూరు అవిష్కరించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రజల గురించి మాట్లడకపోతే పెట్టుబడిదారుల రాజ్యం వస్తుందని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని చెప్పారు. కవి యాకుబ్ మాట్లడుతూ మనం స్వేచ్ఛగా ఉన్నామంటే ఎర్రజెండ పోరాటాల ఫలితమేనన్నారు. రచయిత జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ తాను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉండి అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యమైన విషయాన్ని పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. ప్రజాసమస్యలను అటు అసెంబ్లీలోనూ ఇటు ఉద్యమాల్లోను ప్రజాసమస్యలను ప్రస్తావించి, పరిష్కరించిన అంశాలను పుస్తకంలో రాసినట్టు తెలిపారు. పాలక వర్గాలు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నప్పటికీ వాటిని సరైన పద్ధతుల్లో ఖర్చు చేయని వైనాన్ని ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారించాలని కోరామన్నారు. తాను అసెంబ్లీలో గంటల తరబడి మాట్లాడిన మాటలను తన ప్రజల గొంతుగా పుస్తకంలో పేర్కొన్నట్టు తెలిపారు.

బంజరాహిల్స్‌లో కారు బీభత్సం..

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- బస్సు ఢీకొని దంపతులిద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త ఏడాది మొదటి రోజే హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లో ఓ కారు బీభత్సం సృష్టించడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 5:38 నిమిషాలకు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి పంజాగుట్ట వైపు వెళ్తున్న ఓ కారు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3లో రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద డివైడర్‌ను ఢీకొని అదుపు తప్పింది. ఈ క్రమంలో మరో రెండు కార్లను ఢీకొట్టింది. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ, మరో వ్యక్తిని బలంగా ఢీకొట్టడంతో వారు గాల్లోకి ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న ప్రణవ్, వర్ధన్‌ను అరెస్టు చేశారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వారిని ఎపిలోని రావులపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్, భీమవరానికి చెందిన ఈశ్వరిగా గుర్తించారు. ఈశ్వరీ ఇళ్లల్లో పనిచేసుకొని జీవనం సాగిస్తుంది. శ్రీనివాస్ పెయింటర్‌గా పనిచేస్తున్నారు. ఇక నిందితులిద్దరూ మణిపాల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. నిందితులు మద్యం తాగి వాహనం నడిపినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారి రక్త పరీక్షలు చేయించినట్టు తెలిసింది.

కొడుకుని చూడటానికి వచ్చి..

బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో ఘటనలో కొడుకుని చూడటానికి వచ్చిన వృద్ధ దంపతులను ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో మృతి చెందారు. వివరాల్లోకెళ్తే.. నిర్మల్ జిల్లా బాకాయిపేట గ్రామానికి చెందిన తులసీదాస్, రాజమణి దంపతులు. గచ్చిబౌలిలో ఉన్న తమ కుమారుడిని చూసేందుకు ఆదివారం వారు నగరానికి వచ్చారు. బోయిన్‌పల్లి వద్ద బస్సు దిగి మరో బస్సు ఎక్కేందుకు రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా బోయిన్‌పల్లి కూడలి వద్ద వేగంగా వచ్చిన జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు వారిని ఢీకొట్టింది. దాంతో దంపతులకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు డ్రైవర్ నరహరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తన తల్లిదండ్రుల మరణ వార్త విని కుమారుడు శోక సంద్రంలో మునిగిపోయాడు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరం రోజున ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రార్ధనా మందిరాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలతోపాటు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొత్త ఏడాది సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం, ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో నరసింహుని దర్శనానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ధర్మదర్శనానికి రెండున్నర గంటల సమయం పట్టగా, ప్రత్యేక దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ భక్తులతో కిక్కిరిసిపోయింది. బాలాజీని దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. వరంగల్లులోని శ్రీ భద్రకాళీ ఆలయానికి భక్తులు పోటెత్తారు.

తానా బహుజన కళోత్సవం నూతన ఒరవడి : రసమయి బాలకిషన్

ప్రజాశక్తి కల్చరల్ :

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తెలుగు అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా), తానా ఫౌండేషన్ బహుజన కళోత్సవాలను నగరంలో నిర్వహించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి ఛైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. తానా తొలిసారిగా ప్రకటించి అందజేసిన "బహుజన బంధు" పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావుకు ప్రధానోత్సవ కార్యక్రమం తానా, తార ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రసమయి బాలకిషన్ పాల్గొని పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సనాతనంగా వైవిధ్యమైన కళలను పోషించి ప్రదర్శిస్తోంది బహుజన కళాకారులేనని అన్నారు. అమెరికాలో స్థిరపడి తానా సంస్థను స్థాపించి తెలుగు సంస్కృతిని సాంప్రదాయాలను తెలియజేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 570 మంది కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. తానా అమ్మ ఒడి లాంటిదని, అలాంటి వేదికపై కళారూపాలను ప్రదర్శింపజేసిన వారిని సముచితంగా సత్కరించడం గొప్ప విషయమన్నారు.

కౌలు రైతుకు దిక్కెవరు..?

- పెట్టుబడి సాయం లేదు.. ప్రయోజనాలు లేవు
- పంట నష్టం జరిగినా పరిహారమూ దూరమే..
- పండించిన పంటను అమ్ముకునేందుకు తంటాలు
- అప్పుల బాధలతో బతుకీడుస్తున్న కౌలుదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన రైతు రాథోడ్ దిగంబర్. తనకు మూడెకరాల భూమి ఉండగా, మరో 11 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మూడు బ్యాగులు సోయా.. 12 బ్యాగులు పత్తి వేశారు. ఇప్పటి వరకు 14 క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి వచ్చింది. మరో రెండు క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు చెబుతున్నారు. ఈ పంట కోసం రూ.2.50లక్షల వరకు అప్పు చేశానని దీనిని తీర్చడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జైనథ్ మండల కేంద్రానికి చెందిన రైతు కున్మల సత్యనారాయణ. ఈ ఏడాది ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేశారు. మూడెకరాల్లో సోయ, రెండెకరాల్లో పత్తి పంట వేశారు. కౌలు కోసం ఎకరానికి రూ.20 వేల చొప్పున రూ.లక్ష వెచ్చించారు. పెట్టుబడికి రూ.60 వేల వరకు ఖర్చయింది. కానీ పంట అమ్మగా రూ.లక్ష వరకు మాత్రమే వచ్చినట్టు ఈ రైతు చెబుతున్నారు. చేసిన అప్పులను తీర్చలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ఎక్కడ చూసినా కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భూమి యజమానులకే సర్వహక్కులు ఇచ్చిన ప్రభుత్వాలు.. ఆ భూమిని దున్ని పంట పండించినోళ్లకు మాత్రం వట్టి చేతులే మిగులుతున్నాయి. వ్యవసాయమే జీవనాధారంగా బతుకున్న కౌలు రైతులు ఏటా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పంట నష్టం జరిగి కష్టాల్లో ఉన్న కౌలు రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేశాయి. అసలు కౌలు రైతులను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమూ అందకపోవడంతో పంట కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు ఒడిగడుతున్న సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, ఇతరాత్ర ఎలాంటి ప్రయోజనాలూ వారికి దక్కడం లేదు. ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా కౌలు రైతులు దీనస్థితిని ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే రైతులు అనేక మంది ఉన్నారు. వ్యవసాయం తప్పితే మరే పనిచేయలేని పరిస్థితి ఉండటంతో నష్టం జరిగినా తప్పనిసరిగా దీని మీదనే ఆధారపడి బతుకుతున్నారు. ఏళ్లుగా ఇదే జీవనాధారంగా బతుకుతున్నా ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహాయమూ లభించడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,17,269మంది కౌలు రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 28,763మంది, నిర్మల్ జిల్లాలో 33,212మంది, మంచిర్యాలలో 28,584, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 26,754మంది రైతులు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు ప్రత్యేకంగా రుణ అర్హత కార్డులు అందజేసి పంట రుణాలతోపాటు పండించిన పంటను అమ్ముకునేందుకు వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వివిధ పథకాలు ప్రవేశపెట్టినా కౌలు రైతులను గుర్తించలేమని స్పష్టం చేసింది. దీంతో ఏళ్లుగా భూమిపై ఆధారపడి పంటలు పండిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ లభించడం లేదు.

అన్నింటికీ దూరమే..!

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టింది. వీటికి భూ యజమానులు మాత్రమే అర్హులని పేర్కొంది. ప్రతి ఏటా రైతుబంధు పేరిట ఎకరానికి రూ.పది వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. ఎవరైనా రైతు చనిపోతే ఆ కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం రైతుబీమా అందిస్తోంది. కానీ కౌలు రైతులకు ఈ సదుపాయం లేకుండా పోయింది. భూమిని కలిగి ఉన్న యజమానులకే ఈ ఆర్థిక సాయం అందుతోంది. ఆ భూమిని దున్ని వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు లభించడం లేదు. కౌలు రైతులకు ప్రభుత్వం పంట రుణాలనూ ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడి కోసం ప్రయివేటుగా అధిక వడ్డీలకు అప్పుగా తీసుకొని సాగు కోసం వెచ్చిస్తున్నారు. మంచి దిగుబడి వచ్చినా అప్పులు తీర్చడానికే సరిపోతుందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే మాత్రం పెట్టుబడి పూర్తిగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో పంట దిగుబడి రాకపోగా.. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భూ యజమానుల మాదిరిగానే కౌలు రైతులను కూడా ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆరు రోజుల్లో రూ.1,111.29 కోట్లు

- మద్యం అమ్మకాల్లో రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొత్త ఏడాది సందర్భంగా మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. 6 రోజుల్లో రికార్డు స్థాయిలో రూ.1,111.29 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ లెక్కలు వెల్లడించాయి. డిసెంబరు 30న అత్యధికంగా రూ.254 కోట్లు, 31న రూ.216 కోట్లు విలువైన మద్యం అమ్ముడైందని తెలిపింది. కాగా.. 2021 డిసెంబరు 31వ తేదీన రూ.171.93 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయని ఆబ్కారీ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. కొత్త ఏడాది సందర్భంగా మద్యం విక్రయ వేళలు ప్రభుత్వం పొడిగించడం మందు బాబులకు కలిసొచ్చింది. డిసెంబరు 31న అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. 31వ తేదీ రాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్ల నిర్వహణకు ప్రత్యేక అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వానికి మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం మరింత పెరిగింది.

ఆధునిక సాహితీ విశ్వంభరుడు తిరుమల శ్రీనివాసాచార్య

ప్రజాశక్తి కల్చరల్ :

కవిత, పద్యం, వ్యాసం, నవల, నాటకం వంటి ప్రక్రియల్లోనే తెలుగు శైలిలో మలచిన తిరుమల శ్రీనివాసాచార్య తెలుగు సాహితీ విశ్వంభరుడని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ ప్రశంసించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి నిర్వ్యహణలో డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య 85వ జన్మదినోత్సవం ఆత్మీయంగా జరిగింది. ఈ సందర్భంగా నాగ బాల సురేష్ కుమార్ రూపొందించిన శ్రీనివాసాచార్య జీవిత విశేషాలతో కూడిన గురుపథం లఘుచిత్రంను డాక్టర్ రమణ అవిష్కరించగా తెరపై ప్రదర్శించారు. ఆనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని శ్రీనివాసాచార్యను సత్కరించి మాట్లాడారు. నిరంతర అధ్యయన శీలి, సాహితీ హాలికుడు శ్రీనివాసాచార్య అన్నారు.

హైదరాబాద్ రూపు రేఖలే మారిపోయాయి

కొత్తగూడ-గచ్చిబౌలి ఫ్లై ఓవర్ ప్రారంభించిన కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ రూపురేఖలే మారిపోయాయని, అందుకు సిఎం కెసిఆర్ దిశా నిర్దేశమే కారణమని మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. కొత్తగూడ నుంచి గచ్చిబౌలి వరకు రూ.263 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఫ్లై ఓవర్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఫ్లై ఓవర్ శిలా ఫలకాన్ని ఆవిష్కరించగా ప్రాజెక్టు సిఇ దేవానందం, ఎస్‌సి వెంకట రమణ రిబ్బన్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. రానున్న ఏప్రిల్ వరకు సివరేజ్ పనులు పూర్తయితే దేశంలోనే వందకు వంద శాతం సివరేజ్ కలిగిన మొట్ట మొదటి నగరంగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని మౌలిక వసతులు హైదరాబాద్‌లో కల్పిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కు విద్య, ఉపాధి కోసం పలు రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తున్నారని, ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. రాబోయే 50 ఏండ్లను దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య లేకుండా సిఎం కెసిఆర్ చర్యలు తీసుకున్నారన్నారు. 2022 జనవరి 1న షేక్‌పేట్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించామని, ఇప్పుడు 2023 జనవరి 1న ప్రధాన ఫ్లై ఓవర్‌తో పాటుగా ర్యాంపు నిర్మాణం, అండర్ పాస్‌తో మొత్తం 3.3 కిలోమీటర్ల ఫ్లై ఓవర్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఎస్‌ఆర్‌డీపీ ద్వారా 47 పనుల్లో ఇప్పటివరకు 34 పనులు పూర్తయ్యాయన్నారు. దాంతో నగరంలో 18వ ఫ్లై ఓవర్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని వివరించారు. ఎస్‌ఆర్‌డిపి ద్వారా రూ. 8 వేల కోట్ల వ్యయంతో చేపట్టినట్టు, మిగిలిన 11 ప్రాజెక్టులు 2023 చివరి వరకు పూర్తి చేయనున్నట్టు తెలిపారు సివరేజ్ కోసం 31 ఎస్‌టిపిలను రూ. 3885 కోట్ల వ్యయంతో చేపట్టినట్టు చెప్పారు. ప్రజా రవాణా మెరుగు కోసం ఇటీవల ముఖ్యమంత్రి కెసిఆర్ 70 కిలోమీటర్ల పొడవు గల ఎయిర్ పోర్ట్ మెట్రోకు శ్రీకారం చుట్టారన్నారు. అంతేకాకుండా నగరంలో మూడు వేల ఎలక్ట్రికల్ మోటార్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్టు రవాణా శాఖ మంత్రి తెలిపినట్టు కెటిఆర్ తెలిపారు.

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ.. శేర్‌లింగంపల్లి నియోజకవర్గంలో ఎస్‌ఆర్‌డిపి ద్వారా పది ఫ్లై ఓవర్లకుగాను తొమ్మిది పూర్తయ్యాయన్నారు. తాగునీటి సమస్య లేకుండా 18 రిజర్వాయర్లు సిఎం కెసిఆర్ చేపట్టినట్టు, ప్రతి వార్డులో రూ. 150 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎంపి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్ నెట్‌వర్క్ పెరగడం మూలంగా అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ కోసం భూసేకరణ సకాలంలో చేసిన డిప్యూటీ సిటీ ప్లానర్ గణపతి, రవీందర్ టిపిఎస్‌ను విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వాణి దేవి, జిహెచ్‌ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జోనల్ కమిషనర్ శంకరయ్య, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, హమీద్ పటేల్, సింధు, నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాపార సమ్మేళనాల్లో 'నుమాయిష్' ఒకటి

- దేశ నలుమూలల నుంచి పాల్గొని ఆస్వాదించండి
- నుమాయిష్ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నుమాయిష్ ప్రపంచ వ్యాపార సమ్మేళనాల్లో ఒకటని ఎగ్జిబిషన్ సొసైటీ గౌరవాధ్యక్షులు, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. దేశ నలమూల నుంచి పాల్గొని నుమాయిష్‌ను ఆస్వాదించాలని కోరారు. దీనికి ఇంత పేరు తెచ్చేందుకు ఎంతో మంది కృషి చేశారని గుర్తు చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడిగా తెలంగాణ వ్యాప్తంగా 19 విద్యాసంస్థలకు నిధులు సమకూరుస్తోందన్నారు. సుమారు 30,000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా మహిళా విద్యను ప్రోత్సహించేందుకు విద్యాసంస్థలు నడుపుతోందని వివరించారు. 1938లో ప్రారంభించిన నుమాయిష్ దేశ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వహిస్తున్న 82వ ఎగ్జిబిషన్‌ను మంత్రి ప్రారంభించారు. రైలు బండిపై తిరిగి అన్ని స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్‌ల్లోనే కాకుండా కుల్కచర్ల, పరిగి, నిర్మల్ వంటి దూర ప్రాంతాల్లోనూ విద్యాసంస్థలు ప్రారంభించిందని తెలిపారు. అందులో సుమారు 2,000 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. దీని ద్వారా ప్రతి ఏటా దాదాపు పది వేల మంది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధి పొందుతున్నారని అన్నారు. నుమాయిష్ ఇంత ఇమేజ్ సంపాదించడం సామాన్యమైన విషయంకాదన్నారు. తద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజి పెరుగుతోందని వివరించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుదిక్కుల నుంచి అన్ని రాష్ట్రాల వ్యాపారాలు ఇక్కడ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సాధారణ ప్రజల మద్ధతుతో నుమాయిష్ ఇంతటి ఉదాత్తమైన స్థానానికి చేరుకుందన్నారు. సొసైటీ కార్యవర్గం అంకితభావంతో పని చేయడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. వ్యాపారం, వినోదం అందించడంతోపాటు ఎగ్జిబిషన్ సొసైటీ మానవత్వంతో మంచి కార్యక్రమాలు చేపడుతుందని అభినందించారు. వివిధ రాష్ట్రాలు తిరగాలనీ, అక్కడి సంస్కృతులను, ఆహారాన్ని రుచి చూడాలని అనుకునే వాళ్లకు నుమాయిష్ మంచి వేదిక అన్నారు. కోవిడ్ సమయంలో తమ ఉద్యోగులకు పూర్తి జీతాలు ఇచ్చి ఆదుకుందని తెలిపారు. వివిధ రకాల సంప్రదాయ ఉత్పత్తుల స్టాళ్లతో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను మినీ భారత దేశంగా మార్చారని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్టాల్స్ నిర్వహకుల ఆరోగ్యం పట్ల ఎగ్జిబిషన్ సొసైటీ దృష్టి సారించాలని కోరారు. వారంతా మన రాష్ట్రానికి వచ్చిన అతిథులనీ, వారికి అవసరమైన ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు, మున్సిపల్, జిహెచ్‌ఎంసి, ఆర్‌అండ్‌బి, అగ్నిమాపక శాఖ, విద్యుత్... తదితర విభాగాలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అమరవీరుల పోరాట దృశ్యాల ముగ్గు వేస్తున్న శోభ

సందేశాత్మకమైన 'రంగవల్లిక'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సరం-2023 వేడుకల సందర్భంగా ప్రజలు ఆలోచించేలా అమరవీరుల పోరాట దృశ్యమాలిక, మరో జలియన్ వాలాబాగ్ దృశ్యాలను సందేశాత్మకంగా రంగవల్లిగా రూపొందించారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని పాత ఎటిఎం సెంటర్ ఎల్లంకి శోభ-వీరేష్ ఇంటి ఆవరణలో ఆదివారం ఈ రంగవల్లిక వేశారు. ఇది అందరిని ఆలోచింప చేసేలా ఉండటంతో పలువురు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఎల్లంకి శోభ మాట్లాడుతూ.. కాగా తోటి మిత్రులు, కుటుంబ సభ్యుల సహకారంతో రంగవల్లిక వేసినట్టు తెలిపారు. పరకాల ప్రాంతంలో రజాకారుల పోరాటాలు అద్దం పట్టేలా, ఆనాడు పరకాల ప్రాంత ప్రజలు జాతీయ జెండా ఎగరేయడానికి పూనుకున్నప్పుడు వేలాదిమందిని కాల్చి చంపిన సంఘటనకు నిదర్శనంగా రంగవల్లిక వేసినట్టు తెలిపారు. అమరవీరుల త్యాగాల గురించి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

ఐపిఎటి ఒలింపియాడ్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐపిఎటి-2022) ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీ, మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫలితాల్లో శ్రీచైతన్య సంచలనం సృష్టించింది. అత్యధికంగా వంద సెలక్షన్లు సాధించి సత్తా చాటింది. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ (ఎన్ఎస్ఇ) ఫిజిక్స్‌లో 27 సెలక్షన్లు, కెమిస్ట్రీలో 30 సెలక్షన్లు, బయాలజీలో రెండు సెలక్షన్లు, ఆస్ట్రానమీలో 30 సెలక్షన్లు, మ్యాథ్స్‌లో 11 సెలక్షన్లు మొత్తం వంద సెలక్షన్లు ఒక్క శ్రీచైతన్య విద్యార్థులే సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. అటు బోర్డ్ పరీక్షలతోపాటు పోటీ పరీక్షలు, ఒలింపియాడ్స్ లోనూ తమ సంస్థ విద్యార్థులే టాపర్లుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు, నిపుణులైన ఉపాధ్యాయులు, మైక్రో ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని వివరించారు. ఈ ఒలింపియాడ్‌లో సెలక్షన్లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, బోధనేతర సిబ్బందిని శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బిఎస్ రావు అభినందించారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ర్యాంకర్లతో అవగాహన తరగతులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి త్వరలో నిర్వహించబోయే గ్రూప్-2 రాతపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ర్యాంకర్లతో ఈ నెల నాలుగు నుంచి ఎనిమిదో తేదీ వరకు ఐదురోజులపాటు ఉచిత అవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్టు 21వ సెంచరీ ఐఎఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఉండే తమ అకాడమి సెమినార్ హాల్‌లో నిర్వహిస్తామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-2 అధికారులు ఎస్ రాజు (ఎంపిఒ), ఆనంద్‌కుమార్ (ఎసిటిఒ), సాయి స్ఫూర్తి (ఎఎస్ఒ), డాక్టర్ శాలిని (ఎసిటిఒ), శ్రీలతారెడ్డి (ఎఎంవిఐ) తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొంటారని తెలిపారు. పాలిటీ, ఎకానమీ, చరిత్ర, తెలంగాణ ఉద్యమం, సామాజిక నిర్మాణం వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. గ్రూప్-2 అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆరు రోజుల్లో రూ.1,111.29 కోట్లు

- మద్యం అమ్మకాల్లో రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొత్త ఏడాది సందర్భంగా మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. 6 రోజుల్లో రికార్డు స్థాయిలో రూ.1,111.29 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ లెక్కలు వెల్లడించాయి. డిసెంబరు 30న అత్యధికంగా రూ.254 కోట్లు, 31న రూ.216 కోట్లు విలువైన మద్యం అమ్ముడైందని తెలిపింది. కాగా.. 2021 డిసెంబరు 31వ తేదీన రూ.171.93 కోట్లు విలువైన మద్యం విక్రయాలు జరిగాయని ఆబ్కారీ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. కొత్త ఏడాది సందర్భంగా మద్యం విక్రయ వేళలు ప్రభుత్వం పొడిగించడం మందు బాబులకు కలిసొచ్చింది. డిసెంబరు 31న అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. 31వ తేదీ రాత్రి ఒంటి గంట వరకు ఈవెంట్ల నిర్వహణకు ప్రత్యేక అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వానికి మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం మరింత పెరిగింది.

నోటీసు
మహారాజ శ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐపి 24/2015
పొడపాటి అన్నపూర్ణ ...పిటీషనరు
వర్సెస్
బైరపునేని సాంబశివరావు మరికొందరు
...రెస్పాండెంట్లు
టు:
R37: ముండ్ల శ్రీనివాసరావు తండ్రి కృష్ణమూర్తి ప్లాట్ నెంబర్- 5, గ్రౌండ్ ఫ్లోర్, బ్లాక్ నెంబర్ 35 ఆటోనగర్, వనస్థలిపురం, హైదరాబాద్-500070
తెలంగాణ రాష్ట్రం
పై నెంబరు దావని పిటిషనర్ తనని Insolvent గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటిషన్ దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేదీ: 19 -01-2033న ఉదయం 10:30 గంటలకు నుండి సాయంత్రం 5 గంటలలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లిడర్ ద్వారా కానీ హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనిచో దావాని మీ పరోక్షంగా తీర్మానింపబడును
(కోర్టు వారి ఉత్తర్వులతో)
మోతుకూరి సుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి,
బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం 2వ అధనపు జిల్లాజడ్జివారికోర్టులో
I.A.No.180/2022 in IANo.2088/2018 in O.S.No.51/2015
Between :
నంబూరివీరవెంకటసత్య సూర్య రెడ్డియ్య
S/o.వీర్రాజు, కొత్తపేట, కోనసీమ జిల్లా పిటీషనరు /వాది
AND
1. పాదూరు మాలిని, **W/o.**ప్రవీణ్ కుమార్ @ ప్రవీణ్ రెడ్డి
2. పాదూరు ప్రవీణ్ కుమార్ @ప్రవీణ్‌రెడ్డి
S/o.మోహన్ రెడ్డి Both are R/o. D.No.22-19,
సరూర్ నగర్, హైదరాబాద్,T.S. రెస్పాడెంట్/ ప్రతివాదులు
పై నెంబరులో రెస్పాండెంట్స్ / ప్రతివాదులు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం కోర్టు వాయిదా తేదీ 23-1-2023ను రెస్పాడెంట్స్/ ప్రతివాదులుకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
రెస్పాడెంట్స్/ ప్రతివాదులు ది.23-1-2023 నం.రంతేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10-30ని॥లకు హాజరై ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకో వలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పెదరు అని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
By Order of the Court
అమలాపురం **SSVSNK పళ్ళంరాజు**
ది.29-12-2022 అడ్వకేటు
కొత్తపేట,డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా
సెల్:9849888279

హోం మంత్రిని కలిసిన డిజిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర నూతన డిజిపి అంజనీకుమార్ ఆదివారం ఉదయం రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి గురించి కొద్ది సేపు ఆయన మంత్రికి వివరించారు. హోంమంత్రిని కలిసిన వారిలో నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ కూడా ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

- శాంతి భద్రతలను కాపాడుదాం
- ఐపిఎస్‌లతో డిజిపి అంజనీకుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శాంతి భద్రతలను అందరం కలిసిమెలసి కాపాడుతూ, నేరాలను అరికడదామని నూతన డిజిపి అంజనీకుమార్ తోటి ఐపిఎస్ అధికారులకు పిలుపునిచ్చారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని పోలీసు అధికారుల మెస్‌లో నూతన సంవత్సరం కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమిష్టి కృషితోనే దేనినైనా సాధించగలమని అన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలు సవ్యంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆయన తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాలను అరికట్టగలమనీ, నేరస్తులకు ముక్కుతాడు వేయగలమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు సివి ఆనంద్, రవిగుప్తా, జితేందర్, శివధర్‌రెడ్డి, సంజయ్ జైన్, విజయ్‌కుమార్, మహేష్ భగవత్‌లు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో మొక్కలు నాటండి

- ఎంపి సంతోష్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త సంవత్సరం సందర్భంగా తీసుకునే భవిష్యత్ నిర్ణయాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి కూడా భాగం కల్పించాలని 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం మొక్కను నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవ జీవితాలకు ప్రాణవాయువును ఇచ్చి మనం వదిలిన కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకొని నేలను కాపాడుతున్నాయని అన్నారు. గ్లోబల్ వార్మింగ్, ఆకస్మిక వాతావరణ మార్పులకు అడ్డుకట్టపడాలంటే మొక్కలు నాటడం ఒక్కటే శరణ్యమని వివరించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటేలా ప్రతిజ్ఞ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, వెంకట్ నారాయణ, బి.వేణుగోపాల్, టిఎస్‌టిఎస్ మాజీ చైర్మన్ రాకేశ్, చీటీ రామారావు "గ్రీన్ ఇండియా ఛాలెంజ్" బాధ్యులు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో రాజకీయ కాక

- వేడెక్కించిన నూతన సంవత్సర వేడుకలు
- వచ్చే ఎన్నికల్లో పోటీచేసి తీరతామన్న పొంగులేటి
- పాలేరు నుంచే పోటీచేస్తా : తుమ్మల
- వాడవాడకు పువ్వాడ పేరుతో మంత్రి అజయ్

పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మం జిల్లా రాజకీయమే వేరు. రాష్ట్రమంతా ఒకతీరుగా ఉంటే ఖమ్మంలో మాత్రం మరోవిధంగా ప్రజలు స్పందిస్తారు. ఖమ్మం జిల్లాలో కాకలుతీరిన రాజకీయ ఉద్దండులున్నారు. అయినా, ఏ ఎన్నికలోనూ ఏకపక్షంగా జరిగిన సందర్భాలు లేవు. ఖమ్మం జిల్లాతో సందర్భంలేని నాయకులు సైతం అక్కడ చాలా సందర్భాల్లో గెలిచారు. తెలంగాణ రాష్ట్ర విభజన ప్రకటన తర్వాత 2014 ఎన్నికల్లో రాష్ట్రమంతటా టిఆర్ఎస్ హవా కొనసాగినా ఖమ్మం జిల్లాలో వైఎస్ఆర్‌సిపి పట్టు నిలుపుకుంది. తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ తుడుచుకుపోతే ఖమ్మంలో మాత్రం నిలబడగలిగింది. ఇలా..ఏ ఎన్నిక తీసుకున్నా విభిన్నంగానే ఉంటుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత మారిన రాజకీయ సమీకరణాల్లో సీనియర్ నేత తుమ్మల టిడిపి నుంచి, మాస్ లీడర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైఎస్సార్‌సిపి నుంచి, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు కాంగ్రెస్ నుంచి, వారి అనుచరులతో కలిసి బిఆర్ఎస్‌లో చేరారు. అయితే, ముగ్గురు నాయకులు ఇప్పుడు ప్రభుత్వంలో లేరు. జలగం ప్రసాదరావు గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

గత నాలుగేళ్లుగా ఏ పదవి ఇవ్వకున్నా పొంగులేటి.. కెసిఆర్ వెంటే ఉన్నారు. ఏదో విధంగా పొంగులేటికి పార్టీలో, ప్రభుత్వంలో తగిన గౌరవం దక్కుతుందని ఆశించిన అనుచరులకు భంగపాటేదక్కింది. అయినా, ఏ సందర్భంలోనూ పొంగులేటి తొందరపడలేదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అనుచరుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఇక ఆలస్యం చేస్తే తన రాజకీయ భవిష్యత్తు ప్రమాదమని గ్రహించిన పొంగులేటి మెల్లగా స్వరం పెంచడం మొదలుపెట్టారు. బిఆర్ఎస్ పట్ల తన అసంతృప్తిని ఇప్పటివరకు తన అంతరంగికుల మధ్యే వెళ్లగక్కిన ఆయన.. ఆదివారం ఖమ్మంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర వేడుకల్లో బహిరంగంగానే చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో తనతో పాటు ముఖ్య నాయకులంతా పోటీ చేస్తారని ప్రకటించారు. పొంగులేటి ప్రకటనతో కార్యకర్తలతో పాటు నాయకుల్లో ఉత్సాహం రెట్టింపయింది. అదే సందర్భంలో బిఆర్ఎస్‌లో గందరగోళం మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పొంగులేటికి క్యాడర్ ఉంది. మాస్ లీడర్‌గా ముద్ర వేసుకున్నారు. ఏడెనిమిది నియోజకవర్గాల్లో సత్తా చాటే పవర్ కూడా ఉంది. దీంతో పొంగులేటి దెబ్బ ఎవరికి తగులుతుందోనని సిట్టింగ్ ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా పొంగులేటి ప్రధాన అనుచరుడు, సత్తుపల్లి నియోజకవర్గ కీలక నేత డా.మట్టా దయానంద్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సత్తుపల్లి నుంచి బరిలో దించాలని ఇప్పటికే పొంగులేటి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. త్వరలోనే ఎక్కడ నుంచి ఎవరు పోటీచేసేదీ ఆయన ప్రకటించే అవకాశం ఉంది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పొంగులేటి చేసిన కీలక వ్యాఖ్యలు జిల్లా రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటివరకు బిఆర్ఎస్‌లో ఏం గౌరవం దక్కింది..?అని ఆవేదనతో పొంగులేటి అన్న మాటలు ఆయన రాజకీయ వైఖరిని తేటతెల్లంచేసేలా ఉన్నాయి. అంతేకాకుండా, అన్ని నియోజకవర్గాల్లో పోటీచేసి తీరతామని ప్రకటన చేయడంతో బిఆర్ఎస్‌కు పొంగులేటి గండి కొడతారనేది స్పష్టమైపోయింది. కీలక నేత తుమ్మల సైతం పాలేరులో పోటీకి సిద్ధమవుతున్నారు. తరచుగా నియోజకవర్గానికి వచ్చి నాయకులు, కార్యకర్తలను కలుస్తున్న ఆయన ఆదివారం పాలేరు నియోజకవర్గం పరిధిలోని ఖమ్మం గ్రామీణ మండలంలో నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాలేరు నియోజకవర్గానికి చెందిన తుమ్మల అభిమానులు, నాయకుల ఆత్మీయ కలయిక పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పాలేరు నియోజకవర్గం నుంచి తుమ్మల అభిమానులు భారీగా తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో తామంతా తుమ్మల వెంటే ఉంటామని నాయకులు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి తుమ్మల చేసిన కృషిపై దాదాపు 10వేల పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. తుమ్మల మళ్లీ పాలేరు నుంచే పోటీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఉన్నారు. బిఆర్ఎస్ తరపున కచ్చితంగా తానే పోటీ చేస్తానని ఆయన చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ శ్రేణులు గందరగోళానికి గురవుతున్నారు. ఒకవేళ తుమ్మలకు బిఆర్ఎస్ నుంచి టికెట్ వచ్చినా రాకున్నా ఆయన పాలేరులో పోటీచేయడం తథ్యం. ఒకవేళ ఇదే జరిగితే అటు పొంగులేటి, ఇటు తుమ్మల రాజకీయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ భంగపాటు తప్పదు.

వీళ్లిద్దరూ ఇలా ఉంటే... జిల్లాలో బిఆర్ఎస్‌ను నడిపించే మంత్రి పువ్వాడ అజయ్ మాత్రం తన నియోజకవర్గానికే పరిమితమైనట్లు కనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి పనిచేయాల్సిన ఆయన ఖమ్మం దాటడంలేదనే విమర్శలు సొంత పార్టీలోనే వినిపిస్తున్నాయి. మొత్తం మీద ఎన్నికల ఏడాదిలో ఖమ్మం జిల్లాలో రాజకీయాలు హాట్ టాపిక్‌గా మారాయి.

విద్యానామ సంవత్సరం కావాలి

- టిఆర్‌టిఎఫ్ డైరీ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరించబడి విద్యానామ సంవత్సరంగా 2023 కావాలని ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వైభవం సంతరించుకుంటుందన్నారు. టిఆర్‌టిఎఫ్ డైరీని మంత్రి హరీశ్‌రావు, క్యాలెండర్‌ను మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, టేబుల్ క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం విద్యారంగాన్ని ప్రత్యేక ప్రణాళికతో, పటిష్టమైన కార్యాచరణను రూపొందించి బలమైన ప్రభుత్వ విద్యారంగాన్ని ఏర్పాటు దిశలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచిస్తున్నారని చెప్పారు. విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల సంక్షేమం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలను నిర్వహించేలా సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు న్యాయపరమైన చిక్కుల్లేకుండా పరిష్కరిస్తామని చెప్పారు. సెలవుల్లేకుండా వార్షిక పరీక్షల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం విడివిడిగా పరీక్షల నిర్వహణ, పదో తరగతి పరీక్షలు రోజు విడిచి రోజు ఉండేలా రెండు, మూడు మార్కుల ప్రశ్నలకు ఐచ్ఛికం ఉండేలా అధికారులు, విషయ నిపుణులతో చర్చిస్తామన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ప్రత్యేక శ్రద్ధతో మన ఊరు-మనబడి, మన బస్తీ-మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కావలి అశోక్‌కుమార్, కటకం రమేష్, నాయకులు సుంకిశీల ప్రభాకర్‌రావు, కోలా రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవాలి.. చర్చించాలి

- పిల్లల్లో సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలి
- మార్పు అనివార్యం..స్వాగతించాలి
- బుక్‌ఫెయిర్ ముగింపు సభలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్తికునికి, నాస్తికునికి ఈ దేశంలో సమాన హక్కు ఉందనీ, ఏ అంశంపైనైనా క్షుణ్ణంగా చదివి సహృదయ వాతావరణంలో చర్చ జరిపితే బాగుంటుందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. రైటిస్టు అయినా, లెఫిస్టు అయినా, ఇంకే భావజాలం అయినప్పటికీ మనుషులందర్నీ కలిపే గొప్పతనం పుస్తకానికి ఉందని చెప్పారు. హైదరాబాద్‌లోని కళాభారతిలో జరుగుతున్న హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంతర సాహిత్య చర్చల ద్వార తాత్విక చింతనను భారతి విజ్ఞానాన్ని ఉపనిషత్తులను, ఇతిహాస గ్రంథాల విజ్ఞానాన్ని దర్శించవచ్చని అన్నారు. భాస్కరాచార్య గ్రంథాలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేశానన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సమతాస్ఫూర్తిని ప్రజల మధ్య నింపడానికి కృషిచేశారని పేర్కొన్నారు. పిల్లలందరిలోనూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములు, చర్చా వేదికకు అలిశెట్టి ప్రభాకర్ పేర్లు పెట్టడం అన్నివిధాలా ఆమోదయోగ్యమన్నారు. మార్పును స్వాగతించాలన్నారు. గత చరిత్ర నుంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ .. ఇంటర్ నెట్ వచ్చాక పిల్లల్లో వచ్చిన మార్పులు చూస్తుంటే ఆందోళన కలుగుతున్నదన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు వారి ప్రవర్తనల్లో మార్పు తెస్తాయని ఆకాంక్షించారు. జిల్లాల్లోనూ బుక్‌ఫెయిర్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. జూలూరు గౌరిశంకర్ మాట్లాడుతూ.. పుస్తకాలు మనుషుల్లో వివేకాన్ని పెంచుతాయన్నారు. తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ.. పుస్తకం చదవడం వల్ల వికాశం పెరుగుతుందన్నారు. బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మన తెలంగాణ సాహిత్య పరిమళాలు నలుదిశలా తీసుకెళ్లేందుకు హైదరాబద్ పుస్తక ప్రదర్శన ఎంతో కృషిచేస్తోందన్నారు. గులాంగిరి నవల తనను ప్రభావితం చేసిందన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి మాట్లాడుతూ..జ్ఞాన సమాజాన్ని నిర్మించడంలో పుస్తకానిది కీలక పాత్ర అన్నారు. ఈ సభలో రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మెన్ సోమా భరత్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ అంగ్ల విభాగ అచార్యులు కొండా నాగేశ్వర్, బుక్ ఫెయిర్ కోశాధికారి రాజేశ్వర్‌రావు, కార్యదర్శి శతికాంత్ భారతి, బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు కోయా చంద్ర మోహన్, నారాయణ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వాసు, పాల్గొన్నారు.

మార్చి12 నుంచి ఏప్రిల్ 23 వరకు పోలీసు పరీక్షలు

- ప్రకటించిన పోలీసు నియామక మండలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్ తుది పరీక్షల తేదీలను తెలంగాణ పోలీసు నియామక మండలి (టిఎస్ఎల్‌పిఆర్‌బి) ప్రకటించింది. సివిల్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్, ఫింగర్ ప్రింట్ పోస్టులకు వేర్వేరుగా తేదీలను వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతున్న దేహదారుడ్య పరీక్షలు ఈ నెల ఐదుతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 12 నుంచి ఏప్రిల్ 23 వరకు అన్ని తుది పరీక్షలను పూర్తిచేసేందుకు టిఎస్ఎల్‌పిఆర్‌బి ఏర్పాట్లు చేసింది. ఎస్ఐ తుదిపరీక్షలో మొత్తం నాలుగు పేపర్లు ఉండగా.. ఏప్రిల్ ఎనిమిదిన సివిల్, ఐటీ, ట్రాన్స్‌పోర్ట్ ఎస్ఐ, ఫింగర్ ప్రింట్ విభాగం ఎఎస్ఐ అభ్యర్థులకు మొదటి రెండు పేపర్లను నిర్వహించనున్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్థమెటిక్, రీజనింగ్.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఇంగ్లిష్ పరీక్ష జరగనుంది. ఏప్రిల్ తొమ్మిదిన ఉదయం సివిల్ ఎస్ఐ అభ్యర్థులకు మూడో పేపర్ జనరల్ స్టడీస్, మధ్యాహ్నం తెలుగు లేదా ఉర్దూ పరీక్షలు జరగనున్నాయి. ఎస్ఐ తుది పరీక్షలకు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సివిల్, ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏప్రిల్ 23న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జనరల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఐటీ అండ్ కమ్యూనికేషన్ కానిస్టేబుల్ అభ్యర్థులకు టెక్నికల్ పరీక్ష నిర్వహిస్తారు. మార్చి 12న ఉదయం ఐటీ అండ్ కమ్యూనికేషన్ ఎస్ఐ అభ్యర్థులకు టెక్నికల్ పరీక్ష, మధ్యాహ్నం ఫింగర్ ప్రింట్ ఎఎస్ఐ అభ్యర్థులకు టెక్నికల్ పరీక్ష జరగనుంది. మార్చి 26న ఉదయం ట్రాన్స్‌పోర్ట్ ఎస్ఐ టెక్నికల్ పరీక్ష, ఏప్రిల్ 2న ఉదయం కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టులకు టెక్నికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం కానిస్టేబుల్, మెకానిక్ అభ్యర్థులకు టెక్నికల్ పరీక్ష జరగనుంది. ఈ పరీక్షను కేవలం హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్, డ్రైవింగ్ టెస్టులకు సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించింది.

నూతన సంవత్సర వేడుకల్లో కాసాని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్‌టిఆర్ భవన్‌లో నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ కేక్‌ను కట్ చేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్, యావత్ తెలుగుదేశం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సింహగర్జన సభ విజయవంతం కోసం మూడు జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తామని చెప్పారు. బస్సుయాత్ర ద్వారా ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఎప్పుడు ఏ స్థాయి ఎన్నికలు వచ్చినా, రాబోయే ఎన్నికలకు అన్ని ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు సర్వం సన్నద్ధంగా ఉండాలని తెలుగుదేశం తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ బహిరంగ సభ తర్వాత పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం వెల్లివిరుస్తుందని అన్నారు. రాబోయే రోజులలో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు.

అర్థగణాంక, ప్రణాళిక శాఖల బలోపేతానికి చర్యలు

- త్వరలో నాలుగు రాష్ట్రాల్లో అధికారుల బృందం పర్యటన
- ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్థ గణాంక, ప్రణాళిక శాఖలను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ చెప్పారు. సిఎం కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణను అమలు చేస్తామని అన్నారు. అందులో భాగంగా పలు అంశాలపై అధ్యయనానికి త్వరలో నాలుగు రాష్ట్రాల్లో అధికారుల బృందం పర్యటిస్తుందని వివరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో అర్థ గణాంక శాఖ డైరెక్టర్ జి.దయానంద్ నేతృత్వంలో రాష్ట్ర అధికారుల బృందం, జిల్లా ప్రణాళిక అధికారులు వినోద్ కుమార్‌తో సమావేశమయ్యారు. సిఎం కెసిఆర్ చేసిన సూచనలపై వినోద్ కుమార్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో అర్థ గణాంక, ప్రణాళిక శాఖలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయనీ, వాటిని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరముందంటూ సిఎం అభిప్రాయపడ్డారని చెప్పారు. ఈ శాఖలు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు సంతృప్తిగా ఉన్నాయనీ, అయితే అర్థ గణాంక, ప్రణాళిక శాఖలు మరింత పటిష్టంగా పనిచేసేందుకు పలువురు ఐఎఎస్ అధికారులకు, మరి కొంతమంది రాష్ట్ర స్థాయి అధికారులకు ఈ శాఖల్లో పోస్టింగ్ ఇవ్వాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఏటా అర్థ గణాంక శాఖ డైరెక్టర్ కార్యాలయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు, ఇతర గణాంకాలతో కూడిన అనేక ప్రచురణలు వెలువరిస్తున్నట్టు డైరెక్టర్ జి దయానంద్ వివరించారు. పలు అంశాలపై అధ్యయనం చేసేందుకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాల్లో పర్యటించాల్సిన అవసరముందంటూ వినోద్‌కుమార్ దృష్టికి ఆయన తెచ్చారు. అందుకు సంబంధించిన అంశాలపై కార్యాచరణను సిద్ధం చేయాలంటూ అధికారులను వినోద్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో గణాంక శాఖ అధికారులు డి శివకుమార్, కస్తూరి వెంకట్, బి వేణుమాధవ్, ఆర్ నరసింహ చారి, హరికృష్ణ, బాబురావు, వెంకటేశ్వర్లు, అశోక్, వెంకటరమణ, మాన్య తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లులకు కలెక్టర్ అప్పులు

- 118 గ్రామ పంచాయతీలకు బాకీలు
- రెండు నెలల వాయిదా
- 15వ ఆర్థిక సంఘం నుంచి రాని నిధులు
- అప్పులిచ్చి బిల్లులు వసూలు

బినోల పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పంచాయతీల పరిస్థితి ఆర్థికంగా అధ్వానంగా తయారయింది. అసలే నిధులు లేక సతమతమవుతున్న పంచాయతీలకు బిల్లులు చెల్లించడం సాధ్యం కాలేదు. బిల్లులు వసూలు చేయించే బాధ్యతను వ్యూహాత్మకంగా కలెక్టర్‌లకు ప్రభుత్వం అప్పగించింది. దాంతో చేసేదిలేక కలెక్టర్ నిధుల నుంచి పంచాయతీలకు అప్పులు ఇచ్చి మరీ కరెంట్ బిల్లులు చెల్లించారు. ఈ విధంగా నిజామాబాద్‌లో 118 గ్రామపంచాయతీలకు కలెక్టర్ నిధుల నుంచి రూ.33 లక్షలు బాకీగా అందజేశారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 530 పంచాయతీలు ఉన్నాయి. పల్లె ప్రగతి పనులు చేపట్టే ముందు పంచాయతీలో ఉన్న విద్యుత్ బిల్లులన్నింటిని వన్ టైం సెటిల్మెంట్ కింద క్లియర్ చేయించారు. నాటి నుంచి పంచాయతీలపై విద్యుత్ బిల్లులు భారం ప్రారంభమయ్యింది. దీనికితోడు మిషన్ భగీరథకు సంబంధించిన బోరు మీటర్ల బిల్లులూ అదనంగా జోడించింది. అయితే విద్యుత్ బిల్లుల్లో కొంత మినహాయింపు కల్పించింది. పది శాతం చెల్లిస్తే సరిపోతుందని తెలిపింది. కానీ గత నెల నవంబర్‌లో పంచాయతీల్లో పేరుకుపోయిన 90 శాతం పాత బిల్లులను సైతం చెల్లించాలని విద్యుత్ శాఖ ఆదేశించింది. ఈ మేరకు విద్యుత్ బిల్లుల పెండింగ్‌కు సంబంధించి ఒక నివేదిక తయారు చేసింది. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి మొత్తం రూ.35 కోట్లు పెండింగ్ ఉన్నట్టు తేల్చారు. ఈ విద్యుత్ బిల్లులపై అధికార పార్టీ సర్పంచుల నుంచి సైతం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. అయినప్పటికీ పంచాయతీ అధికారులు కార్యదర్శులకు, సర్పంచులకు ఒత్తిడి చేయడంతో తప్పక చెల్లించారు. ఎనిమిది నెలలుగా 15వ ఆర్థిక సంఘం నుంచి పంచాయతీలకు నిధులు రావడం లేదు. రాష్ట్ర ఖజానా నుంచి సైతం నాలుగు నెలలుగా నిధుల్లేవ్. ఈ పరిస్థితిలో బిల్లులు ఎలా చెల్లించాలని సర్పంచులు వాపోయారు. జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తూ బిల్లులు వసూలు చేసింది.

కరెంట్ బిల్లులకు కలెక్టర్ అప్పులు..

జిల్లాలో కరెంట్ బిల్లులు చెల్లించలేని స్థితిలో ఉన్న పంచాయతీలకు కలెక్టర్ నిధుల నుంచి రియంబర్స్‌మెంట్ చేసి మరీ విద్యుత్ బిల్లులు వసూలు చేశారు.

ఈ విధంగా జిల్లాలో 118 గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ఫండ్ నుంచి రూ.మూడు లక్షలు బాకీ ఇచ్చినట్టు సమాచారం. ఈ బిల్లులను పంచాయతీలకు నిధులు వచ్చిన సమయంలో చెల్లించేలా సర్దుబాటు చేశారు. అక్టోబర్ 25వ తేదీన పంచాయతీల ప్రత్యేక ఫండ్ నుంచి నిధులు రాగా నవంబర్ నెలలో పంచాయతీల నుంచి కరెంటు బిల్లులు చెల్లించారు. కలెక్టర్ ఫండ్ నుంచి నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు.. గతంలోనూ ట్రాక్టరు, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోళ్లకు 20 పంచాయతీలకు రూ.50 లక్షలు బాకీలు చేశారు. దీనికి తోడు నర్సరీకి మరో రూ.పది లక్షలు పంచాయతీ కార్యాలయం బాకీ చేసింది. సకాలంలో నిధులు విడుదల కాక పంచాయతీలు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై గతంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధను వివరణ కోరగా కరెంట్ బిల్లులకు కలెక్టర్ ఫండ్ నుంచి నిధులు తీసుకోలేదని చెప్పారు. కానీ సర్పంచ్‌లు మాత్రం విద్యుత్ బిల్లులకు తమ ఖాతాలో నిధులు తక్కువగా ఉంటే కలెక్టర్ ఫండ్ నుంచి సర్దుబాటు చేసి కరెంట్ బిల్లు కట్టించుకున్నారని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల జీతాలు చెల్లించాలి : సిఎల్ఎఫ్ జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కాంట్రాక్టు అధ్యాపకులకు మూడు నెలలుగా జీతాలు అందడంలేదని కాంట్రాక్టు లెక్చరర్ల ఫోరం (సిఎల్ఎఫ్) జెఎసి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం కన్వీనర్ సయ్యద్ జబీఉల్లా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సకాలంలో జీతాలు రాక కాంట్రాక్టు అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీతాలను చెల్లించాలని కోరారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. కొత్త సంవత్సరంలోనైనా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నితీష్, లాలుప్రసాద్‌కు అభినందనలు : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బిహార్ సిఎం నితీష్‌కుమార్, ఆర్‌జెడి సీనియర్ నేత లాలుప్రసాద్ యాదవ్ సమర్థించడం పట్ల మాజీ ఎంపి వి.హనుమంతరావు అభినందనలు తెలిపారు. ఇది మంచి శుభ పరిణామమని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇతర పార్టీలు కూడా ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు.

గ్రామాల్లో పల్లె ప్రగతి ఫలాలు

- సంతోషంలో సర్పంచులు... ఆదాయంలో పంచాయతీలు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అమలవుతున్న ప్రతిష్టాత్మక పథకాల్లో పల్లె ప్రగతి ప్రత్యేకమైందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలన్న జాతిపిత గాంధీజి స్ఫూర్తితో సిఎం కెసిఆర్ పల్లెలను పటిష్టం చేసేందుకు ప్రారంభించిన పథకం పల్లె ప్రగతి కార్యక్రమమని స్పష్టం చేశారు. పల్లెలను స్వయం సమృద్ధిగా తయారు చేయడం, పల్లెల్లో పరిశుభ్రత పాటించడం, పచ్చదనం పెంపొందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలుగా 2015లో దీనిని ప్రారంభించగా... ఆ ఆశయాలు నేడు ఆచరణగా మారిందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరాకే గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించిన తీరును మంత్రికి వివరించారు. తమ గ్రామంలో తయారు చేసిన వర్మి కంపోస్ట్‌ను సర్పంచ్ దంపతులు మంత్రికి బహుకరించారు. పల్లె ప్రగతి విజయవంతంగా అమలు చేసి స్వయం సమృద్ధి గ్రామంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. పల్లె ప్రగతి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ట్రాక్టర్, అమలు చేస్తున్న తడి, పొడి చెత్త విధానం, డంపింగ్ యార్డు నిర్వహణ, కంపోస్ట్ ఎరువు తయారి గ్రామానికి ఆదాయ మార్గంగా మారాయని తెలిపారు. ఏడాదిన్నర కాలంలో పల్లె ప్రగతి వర్మి కంపోస్ట్ తయారి ద్వారా ఏడు లక్షల రూపాయల ఆదాయం సంపాదించారని పేర్కొన్నారు. ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరించడం, తడి, పొడిచెత్తగా వేరు చేయడం, దానిని వర్మి కంపోస్ట్ ఎరువుగా మార్చడం ద్వారా ఈ గ్రామ సర్పంచ్ గాడిగె మీనాక్షి విజయవంతం అయ్యారని మంత్రి చెప్పారు. సంపాదనలో వచ్చిన డబ్బుతో నాలుగు లక్షలు ఖర్చు చేసి సోలార్ లైట్లు ఏర్పాటు చేసి, రెండు లక్షలతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారన్నారు. ఆర్గానిక్ కంపోస్ట్ తయారు చేయడమే కాకుండా దానిద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరించడం ద్వారా వంద మంది రైతులు ఆ గ్రామంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నట్టు తెలిపారు. ముఖరాకే గ్రామ సర్పంచ్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఆర్గానిక్ వ్యవసాయం చేయడం వల్ల మట్టికి, మనుషులకు మేలు జరుగుతందన్నారు. రసాయనాలను నివారించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు.

పల్లావి అహంకారపు మాటలు

- కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల సమస్యల విషయంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకేత అన్వేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లా నోటికి ఏదోస్తే అది మాట్లాడడం సరికాదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంట నష్టం పరిహారాన్ని ఇవ్వలేదన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీలు పెరిగి రైతులపై భారం పడుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 16 లక్షల మంది రైతులు రుణాలు చెల్లించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టాన్ని పట్టించుకోలేదంటూ రైతు స్వరాజ్య వేదిక చేస్తోన్న విమర్శలను ప్రభుత్వం సమీక్షించుకోవాలని ఆయన సూచించారు.